సాక్షి మంచిర్యాల

శుక్రవారం। 10। నవంబర్। 2023



కార్మికుల జీవితాల్లో 'చీకటి'

శాలివాహన పవర్‌ప్లాంటు మూతపడి కార్మికుల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ఉత్పత్తి నిలిపి వేసి ఏడాది కావస్తుండగా.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

IIలో▸



'గిరి' గ్రామాల్లో దండారీ

హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో దండారీ ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. సంప్రదాయ నృత్యం చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

IIలో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0 /21.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఒక్క రోజే 27 నామినేషన్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మూడు నియోజకవర్గాలకుగాను గురువారం ఒక్క రోజే 27 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 8 నామినేషన్లు, మంచిర్యాలలో 8, బెల్లంపల్లిలో 11 నామినేషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 10న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారికి అందజేయాలని తెలిపారు. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. అభ్యర్థిత్వం ఉపసహరించుకోవడానికి నోటీసును అభ్యర్థి కానీ, ప్రతిపాదకులు కానీ అభ్యర్థి రాతపూర్వకంగా ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలని తెలిపారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

11న రేవంత్‌రెడ్డి రాక



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న వినోద్

బెల్లంపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 11న బెల్లంపల్లికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రానున్నారు. ఇందుకు సంబంధించి పాతబస్టాండ్ ఏరియాలోని సింగరేణి తిలక్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సభ ఏర్పాట్లు చేస్తోంది. గురువారం బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ తిలక్ స్టేడియానికి వెళ్లి సభాస్థలిని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, సూరిబాబు, చిలుముల శంకర్, ఉదయ్‌కాంత్, మునిమంద రమేష్, కారుకూరి రాంచందర్, దావ రమేష్, నర్సింగరావు, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

లక్సెట్టిపేట: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రావుపేట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలను పెంచడం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా, ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. 80 శాతం సాధారణ ప్రసవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, వ్యాక్సినేషన్లు సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్‌కుమార్, సిబ్బంది శివప్రతాప్, లక్ష్మణ్‌స్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లోని ఎస్‌ఈఆర్‌టీ భవనంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా తరఫున సైన్స్ నాటికను ప్రదర్శించారు. విద్యార్థులు అక్షయ, రమ, బిందుప్రియ, సాగర్, నరేందర్, ఐశ్వర్య, అఖిల, వినయ్, లక్ష్మణ్ మూఢనమ్మకాలు, మిల్లెట్స్, ఆహారభద్రత, తదితర అంశాల్లో మిల్లెట్స్ ప్రధాన అంశంగా ప్రచార యుద్ధమనే నాటికను ప్రదర్శించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే 300రోగాలను దూరంగా తరిమి కొట్టవచ్చని, తక్కువ నీరుతో పంటలు పండుతాయని, అందులో ఉన్న ప్రోటీన్లను వివరించారు. విద్యార్థులతో కలిసి గైడ్ టీచర్ శాంకరీ బహుమతి స్వీకరించారు. విద్యార్థులు, గైడ్ టీచర్‌ను డీఈవో యాదయ్య, ఎంఈవో వాసాల ప్రభాకర్ అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన శేజల్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ నిర్వాహకురాలు బోడపాటి శేజల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం బెల్లంపల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శేజల్‌కు రాష్ట్ర మాజీ మంత్రి, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో సీఈఓ కందిమళ్ల ఆదినారాయణపై పెట్టిన పీడీ యాక్టును ఎత్తి వేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బల ప్రదర్శన!

- పోటాపోటీగా నామినేషన్ల దాఖలు
- చెన్నూరులో బీఆర్ఎస్, కాంగ్రెస్ జోరు
- మంచిర్యాలలో పీఎస్సార్ భారీ ర్యాలీ
- నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం



నామినేషన్ దాఖలు చేస్తున్న చెన్నూరు బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్, ఎమ్మెల్యే అశోక్ రాంజీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం చివరి దశకు చేరడంతో రాజకీయం మరింత వేడెక్కింది. గురువారం మంచిరోజు కావడంతో నామినేషన్ల దాఖలుకు వివిధ పార్టీల అభ్యర్థులు భారీగా అనుచరగణంతో తరలి రావడంతో నామినేషన్ కార్యాలయాల వద్ద సందడి ఏర్పడింది. పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేసి బల ప్రదర్శన చేశారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకులు బైక్‌లు, వాహనాలపై ర్యాలీగా తరలి రాగా రోడ్లన్నీ కిక్కిరిసి నామినేషన్ల పర్వం జాతరలా సాగింది. మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు ఒకే రోజు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రేమ్‌సాగర్‌రావు భారీ ర్యాలీతో నామినేషన్ కేంద్రానికి తరలివచ్చి కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ వేశారు. దివాకర్‌రావు సైతం కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్వో రాములుకు అందజేశారు. బెల్లంపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, స్వతంత్ర అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్ వేశారు. చెన్నూరు బీజేపీ అభ్యర్థిగా దుర్గం అశోక్ ఓ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట సతీమణి అరుణతోపాటు మహారాష్ట్ర మాజీ మంత్రి, రాలేగావ్ ఎమ్మెల్యే అశోక్ రాంజీ ఉయికె, తదితరులు ఉన్నారు.

చెన్నూరులో ఉద్రిక్తత

చెన్నూర్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాల్క సుమన్, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ నామినేషన్లు వేసే క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలసి నామినేషన్ కేంద్రానికి కొద్ది దూరంలోనే వాహనం నిలిపి కాలినడకన వెళ్తుండగా, అదే సమయంలో సుమన్ కారులో ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో వివేక్, ఆయన వర్గీయులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమకు కూడా నామినేషన్ కేంద్రానికి సమీపం వరకు వాహనంలో వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఏసీపీ మోహన్, సీఐ రాజమౌళిగౌడ్‌తో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. మీడియా ప్రతినిధులు కూడా వెళ్లేందుకు అనుమతి ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

నేడు ఆఖరు..

నామినేషన్ల దాఖలుకు నేడు శుక్రవారం చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు సంబంధించి మరో సెట్ నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉంది. శనివారం నుంచి నామినేషన్ల ఉపసంహరణ, పరిశీలనలో తిరస్కరణ తర్వాత ఎన్నికల బరిలో ఉన్న తుది పోటీదారుల జాబితా వెల్లడవుతుంది. దీంతో ప్రచార వేడి ఊపందుకోనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ తదితర పార్టీల అభ్యర్థుల ప్రకటన వెలువడింది. అన్నీ పార్టీల్లోనూ నామినేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇక ఓట్ల కోసం అభ్యర్థుల ప్రచారం ముమ్మరం కానుంది.

నామినేషన్ల వెల్లువ



నామినేషన్ వేస్తున్న, బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పీఎస్సార్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఆరో రోజు గురువారం నామినేషన్లు వెల్లువెత్తాయి. గురువారం మంచి రోజు కావడంతో ఆలయాల్లో పూజల అనంతరం నామినేషన్లు దాఖలు చేశారు. మంచిర్యాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఒక సెట్, బీజేపీ నుంచి రెండో సెట్ నామినేషన్ వేశారు. ధర్మసమాజ్ పార్టీ నుంచి అందునూరి రమేష్, స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ కలీమ్, అందె మంగ, తల్లూరి వెంకటేశ్వర్లు రెండో సెట్ నామినేషన్ వేశారు.

జిల్లాలో 64 నామినేషన్లు..

ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా.. శుక్రవారం నాటితో ముగియనుంది. ఇప్పటికే నామినేషన్లు వేసిన అభ్యర్థులు రెండో, మూడో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు నామినేషన్లు వేయని పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు నామినేషన్లు వేయనున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు నియోజకవర్గాల్లో 50 మంది అభ్యర్థులు 64 నామినేషన్లు దాఖలు చేయగా.. ఇందులో 13 నామినేషన్లు రెండవ, మూడవ సెట్ నామినేషన్ వేశారు.

చెన్నూర్‌లో ఆరుగురు..

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో గురువారం ఆరుగురు అభ్యర్థులు 8 సెట్ల నామినేషన్ పత్రాలు అందజేసినట్లు ఆర్వో సిడాం దత్తు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాల్క సుమన్ రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానంద రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్, స్వతంత్ర అభ్యర్థిగా జాడి ఎసయ్య, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) అభ్యర్థిగా మోతె రాజలింగు, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నడిపాటి రాజ నామినేషన్లు దఖాలు చేశారు.



చెన్నూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సుమన్



చెన్నూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వివేకానంద



కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్



బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి

బెల్లంపల్లిలో తొమ్మిది మంది..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గురువారం తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, బీజేపీ పక్షాన అమురాజుల శ్రీదేవి ఆమె భర్త అమురాజుల రాజేశ్వర్ నామినేషన్ వేశారు. వీరితో పాటు రామటెంకి శ్రీనివాస్(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), జాడి నర్సయ్య(బీఎస్పీ), గోగర్ల శంకర్ (సీపీఐ-ఎంఎల్ రెడ్ స్టార్), స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గె ఈశ్వర్, పెరుగు రవీందర్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. వీరిలో దుర్గం చిన్నయ్య, దుర్గె ఈశ్వర్‌లు రెండేసి సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను అందజేసినట్లు బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్ ప్రకటించారు. 9 మంది అభ్యర్థులు మొత్తం 11 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారని పేర్కొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య

సాధారణ ఎన్నికల పరిశీలకుల రాక







సజ్జన్ ఆర్, ఆర్ ఇలాంగో, బిశ్వత్ దుత్తకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారులు బిశ్వత్ దుత్త, సజ్జన్ ఆర్ గురువారం నస్పూర్‌లోని సింగరేణి గెస్టుహౌజ్‌కు, జిల్లా పోలీసు పరిశీలకులుగా ఐపీఎస్ అధికారి ఆర్.ఇలంగో జైపూర్‌లోని ఎస్టీపీపీ గెస్టుహౌజ్‌కు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గ పరిశీలకులుగా బిశ్వజిత్ దుత్త, చెన్నూర్ నియోజకవర్గ పరిశీలకులుగా సజ్జన్ ఆర్ వ్యవహరిస్తారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పర్యవేక్షిస్తారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు అధికారుల విధుల పర్యవేక్షణ పోలీసు శాఖ పరిశీలకులు ఆర్.ఇలంగో పరిశీలిస్తారు.

ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ సైనికుడు కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

బెల్లంపల్లి: మారుతున్న ఆధునిక యుగంలో వ్యవసాయానికి దూరమవుతున్న ప్రతీ రైతు తిరిగి వ్యవసాయం వైపు దృష్టి మరల్చేలా ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ సైనికుడిగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.సుధారాణి అన్నారు. గురువారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే), నాగపూర్ వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ(అటారి) జోన్-10 ఆధ్వర్యంలో కేవీకే ప్రాంగణంలో కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రస్థాయిలో రైతు సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి సారించి ఎన్నో కొత్త వంగడాలను రూపొందిస్తోందని తెలిపారు. జగిత్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ భూసార పరిరక్షణ కోసం రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని అన్నారు. యాసంగిలో పంటల సాగు విధానాన్ని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత వివరించారు. ఆరుతడి పంటల సాగు, లాభాలు గడించే విధానం తెలియజేశారు. అంతకుముందు పంటల సాగు పద్ధతులు వివరించే కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుమురంభీమ్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మిలింద్, ఆర్‌ఈఏసీ సభ్యులు వెంకటేశ్వరరావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రజినీకాంత్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల రైతులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజలకు ఉచిత న్యాయసేవలు

- జిల్లా జడ్జి కే.ప్రభాకరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

మంచిర్యాలక్రైం: సామాన్య, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కే.ప్రభాకరరావు అన్నారు. స్థానిక జిల్లా కోర్టు హాల్‌లో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయసేవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించే విధంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు వ్యవహరించాలని అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను ఇరువర్గాల కక్షిదారులు పరిష్కరించుకోవాలని అన్నారు. మహిళలు వరకట్నం, లైంగిక వేధింపులు, అత్యాచారం వంటి కేసుల్లో న్యాయం పొందడానికి న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించి సలహాలు, న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం న్యాయసేవాధికర సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయసేవాధికర సంస్థలోని పథకాలను వివరించారు. పారా లీగల్ వలంటీర్ల కోసం పథకం, ట్రాఫికింగ్, మానసిక అనారోగ్యం, మానసిక వికలాంగుల చట్టం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్జి ఉపనిషద్వని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోతిలాల్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా సంక్షేమాధికారి కే.చిన్నయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి దివ్యాంగుల ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ శాతం పెంపొందించడంలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, ర్యాంపు ఏర్పాటు చేశామని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో 10,198 మంది దివ్యాంగులు ఉన్నారని, అంధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బ్రెయిలీ బ్యాలెట్ అందుబాటులో ఉంచామని తెలిపారు. యాప్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకున్న దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి ఇంటి వద్దకు చేర్చడం చేస్తామని తెలిపారు. అనంతరం ఎన్నికల సంఘం రూపొందించిన బ్యాలెట్ బ్యాక్స్‌లో దివ్యాంగులు ఓటు వేసే పద్ధతిని వివరించే కరపత్రం, గోడప్రతులను ఆవిష్కరించారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించండి

- జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళి
- జిల్లాలో బస్సు యాత్ర



బెల్లంపల్లిలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

చెన్నూర్/నెన్నెల/మంచిర్యాలక్రైం: అవినీతి, ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ప్రభుత్వాన్ని గద్దె దించాలని, మద్యం, కానుకలు, డబ్బులకు లొంగకుండా నిజాయతీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటైర్డు ఐఏఎస్, జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర గురువారం చెన్నూర్, నెన్నెల, మంచిర్యాలలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. నాలుగున్నర కోట్ల జనం దశాబ్దాల ఆకాంక్షలను వేల కోట్ల కుంభకోణాలతో కల్వకుంట్ల కుటుంబం తన్నుకుపోయిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడా అని ప్రశ్నించారు. కేజీ టు పీజీ విద్య, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, రుణమాఫీ ఎవరికి అందిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో జిల్లాకు ఒరిగిందేమిటని అన్నారు. కమీషన్ల కోసం నిర్మించిన ప్రాజెక్ట్ గతి ఏమైందని, పిల్లర్లన్నీ కూలి పోతున్నాయని, ప్రాజెక్ట్ ఎండిపోతోందని ఆరోపించారు. కాగా, మంచిర్యాలలో ఆయన ప్రసంగం ముగించగానే అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి అడ్డుపడ్డాడు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయొద్దని ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాసామ్య వేదిక కన్వీనర్ కాకతీయ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సమన్వయకర్త నైనాల గోవర్ధన్, రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజ, మైనార్టీ నాయకురాళ్లు కలిదజియా, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా కళోత్సవ్ పోటీలు



విజేతలతో అధికారులు, న్యాయనిర్ణేతలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా సైన్స్ సెంటర్‌లో జిల్లాస్థాయి 2023 కళోత్సవ్ పోటీలు ముగిశాయి. తొమ్మిది తరగతి నుంచి ఇంటర్ వరకు నిర్వహించిన ఈ పోటీలను డీఈవో యాదయ్య బుధవారం ప్రారంభించారు. శాస్త్రీయ గాత్ర సంగీతం, సంప్రదాయ సంగీతం, జానపద వాయిద్య సంగీతం, శాస్త్రీయ నృత్య, జానపద నృత్య, చిత్రలేఖనం, ఇండిజీనియస్‌టాయ్స్ అండ్ గేమ్స్, ఏకపాత్రాభినయం భాగంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. సెక్టోరల్ అధికారి చౌదరి పర్యవేక్షణలో జరిగిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా జనార్దన్ ఆర్కేవ ప్రసాద్, కరుణాకర్, అన్నపూర్ణ, ఉప్పులేటి నరేష్, లక్ష్మణ్, మూర్తి, నరేంద్రబాబు వ్యవహరించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి

లక్సెట్టిపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు. కక్షిదారులకు కోర్టులో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా వారి కేసును ఉచితంగా పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కేసుల్లో రాజీ పడితే ఇతర కోర్టులో అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉండదన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉన్నత చదువులు చదివి మంచి హోదాలో ఉండాలని సూచించారు. అనంతరం మహిళ, విద్య చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సురేందర్, న్యాయవాదులు అక్కల శ్రీధర్, శివశంకర్, మల్లికార్జున్, రవిరాజ, గణేష్, వినీత, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరు మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని–మంచిర్యాల రైల్వేస్టేషన్ల మధ్య క్యాతనపల్లి రైల్వే గేటు సమీపంలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మృతుని వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు మృతి చెందాడా? తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైద్యురాలిని వేధించిన ముగ్గురికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: వైద్యురాలిని వేధించిన కేసులో ముగ్గురు యువకులకు ఏడాది జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి కే.ప్రభాకరరావ్ గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ రాజు తెలిపారు. కాలేజ్‌రోడ్ గర్మిళ్లకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యురాలిని అదే ప్రాంతానికి చెందిన అట్లా సంతోష్, మాటేటి శ్రావణ్, అందె అశోక్ కొంతకాలంగా వెంబడించేవారు. 2018 మే 27న నైట్ డ్యూటీకి వెళ్తుండగా ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెంబడించి వేధింపులకు గురిచేయడంతో 2018 మే 30న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో రెండో అదనపు కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీంతో నిందితులు జిల్లా కోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావ్ కేసును విచారించిన అనంతరం నిందితుల అప్పీల్‌ను కొట్టివేస్తూ అదేతీర్పును ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

ప్రలోభాలను పట్టేసుకుంటారు..


ఫ్లయింగ్ వాహనంపై సీసీ కెమెరా

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగదు, కానుకలు ఓటర్లకు చేరవేయకుండా ఉండేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం పెద్ద ఎత్తున వాహనాల్లో గస్తీ చేపడుతుంది. అయితే ఇటీవల వీరి వాహనాలకు 360 డిగ్రీలు తిరుగుతూ రికార్డింగ్ చేసేలా ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ వాహనానికి జీపీఎస్ కూడా ఉండటం, సీసీ కెమెరా పనితీరు మొత్తం ఎన్నికల కమిషన్‌కు అనుసంధానంగా ఉండటంతో వీరి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఓటర్లకు పంచే నగదు, నగలు, కానుకలను గుర్తించడంతో పాటు వాటిని పట్టుకుంటుంది. పోలింగ్ జరిగేంత వరకు ఈ వాహనాలు నిరంతరం చక్కర్లు కొడుతూ నిఘా ఉంచుతాయి. మంచిర్యాల నియోజకవర్గంలో మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలు 24 గంటల పాటు నిఘాలో ఉంటున్నాయి.

కార్మికుల జీవితాల్లో 'చీకటి'

- మూతబడిన శాలివాహన పవర్ ప్లాంట్
- కార్మికులకు అందని బెనిఫిట్స్
- ఆర్థిక ఇబ్బందుల్లో వంద కుటుంబాలు


నినాదాలు చేస్తున్న కార్మికులు (ఫైల్)


శాలివాహన పవర్‌ప్లాంట్ (ఫైల్)

పాతమంచిర్యాల: శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్‌లో పనిచేసిన కార్మికుల జీవితాల్లో ఏడాదికాలంగా చీకట్లే అలుముకున్నాయి. పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసి దాదాపు ఏడాదికాలం పూర్తయ్యింది. పవర్‌ప్లాంట్‌లో నష్టాలు వస్తున్నాయని యాజమాన్యం డిశంబర్ 06 2022న కంపెనీని మూసివేసింది. అప్పటి నుంచి కంపెనీలో పనిచేస్తున్న 100 మంది శాశ్వత, 100 మంది దినసరి కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. కంపెనీని అధికారికంగా మూసివేస్తున్నామని ప్రకటించిన యాజమాన్యం కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు, గ్యాట్యుటీ, ఇన్‌సెంటివ్‌లు చెల్లించాల్సి ఉండగా అవేం లేకుండానే ఏడాదికాలంగా కార్మికులను తిప్పుకుంటున్నారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. లేబర్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్లాంట్ యజమాని మల్క కొమురయ్య స్పందించడంలేదన్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న తన ఇంటికి వెళ్లి కలిసినా వెళ్లినప్పుడల్లా ఏదో ఒక కారణం చెప్పి కాలయాపన చేశారన్నారు. పవర్‌ప్లాంట్‌కు ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన రూ.10 కోట్లను కార్మికులకు జీతభత్యాల కింద జమ చేస్తామని నమ్మించి ట్రాన్స్‌కో ఇచ్చిన రూ.10 కోట్లను బ్యాంకు ద్వారా డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నాడని కార్మికులు వాపోయారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్‌లు ఇవ్వడంలో కావాలనే యాజమాన్యం జాప్యం చేస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. శాశ్వత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు వస్తాయని, అవి వస్తే ఏదైనా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవచ్చని ఆశపడితే యాజమాన్యం కాలయాపన చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కంపెనీలోని సామగ్రి పూర్తిగా తరలించిన తర్వాతే కార్మికులకు బెనిఫిట్స్ సెటిల్‌మెంట్ చేస్తామని మంచిర్యాల అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు రాతపూర్వకంగా లెటర్ రాసి ఇచ్చినట్లుగా తెలిసిందని కార్మికులు తెలిపారు. తమకు రావాల్సిన జీత భత్యాలు, బెనిఫిట్స్ చెల్లించనిదే కంపెనీలోని ఒక్క వస్తువు కూడా తరలించేది లేదని కార్మికులు పట్టుదలతో ఉన్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి

శాలివాహన పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన జీత భత్యాలు, ఏరియర్స్ చెల్లించాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చాం. కంపెనీ ప్రొప్రయిటర్ మల్క కొమురయ్య, డైరెక్టర్ నవీన్ ఏదోఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తూవచ్చారు. కావాలని నష్టాలు చూపించి ప్లాంట్‌ను మూసివేసి కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చిన తర్వాతే ప్లాంట్‌లోకి అడుగు పెట్టనిస్తాం.

– కుంటాల శంకర్, పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు

కోవ లక్ష్మి ఆస్తి రూ.1.18 కోట్లు


కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోవ లక్ష్మి మొత్తం ఆస్తి విలువ రూ.1,18,80,862, ఉన్నట్లు గురువారం సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ.2 లక్షలు, భర్త సోనేరావు వద్ద రూ.50 వేల నగదు ఉన్నట్లు వివరించారు. రూ.80,50,862 స్థిరాస్తులు, రూ.38,30,000 విలువైన చరాస్తులు, రూ.42,50,862 విలువైన బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. భర్త సోనేరావు పేరుతో రూ.1,14,54,291 ఆస్తి ఉండగా ఇందులో రూ.18,24,391 విలువైన స్థిరాస్తి, రూ.96,30,000 విలువైన చరాస్థి ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.20 లక్షల విలువైన ఇన్నోవా, రూ.18 లక్షల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. భర్త పేరుతో రూ.13 లక్షల విలువైన బొలేరో వాహనం, రూ.2.40 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. తన పేరుతో మహేంద్ర అండ్ మహేంద్రలో రూ. 8 లక్షల రుణం, సోనేరావు పేరుతో రూ.6 లక్షల రుణం ఉన్నట్లు పేర్కొన్నారు. 2018 ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో కోవ లక్ష్మి వద్ద రూ.లక్ష నగదు, సోనేరావు వద్ద రూ.10 వేలు ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.21 లక్షల విలువైన స్థిరచరాస్తులు, భర్త సోనేరావు పేరుపై రూ.50 వేల ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. కోవ లక్ష్మి పేరుమీద 3.25 ఎకరాలు, సోనేరావు పేరుమీద 5.30 ఎకరాలు, నివాస భవనం ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్యాంనాయక్ ఆస్తి రూ.1.95 కోట్లు


శ్యాంనాయక్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీరా శ్యాంనాయక్ మొత్తం ఆస్తి విలువ రూ.1,95,63,841 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో రూ.84,34,111 విలువైన బ్యాంకు డిపాజిట్లు, నగదు, స్థిరచరాస్తులు, రూ.1,11,29,730 విలువైన 5.12 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఇల్లు, 200 గజాల ప్లాటు, 1000 గజాల స్థలం ఉంది. రూ.37 లక్షల విలువ చేసే ఫార్చునర్ వాహనం ఉంది. అప్పులు లేవు. ఆయన భార్య, ఎమ్మెల్యే రేఖానాయక్ మొత్తం ఆస్తి విలువ రూ.10,63,79,190 ఉండగా ఇందులో రూ.6,78,79,190 విలువైన నగదు, బ్యాంకు డిపాజిట్లు, రూ.3,85,00,000 విలువైన 28.39 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఖానాపూర్‌లో ఇల్లు, 5,500 గజాలు, 2000 గజాల స్థలాలు ఉన్నాయి. రూ.30 లక్షల విలువైన ఇన్నోవా, రూ.75 లక్షల విలువైన బెంజ్ కారు ఉన్నాయి. ఎస్‌బీఐలో రూ.18,95,820 సీసీ లోన్, రూ.1,57,45,721 టర్మ్‌లోన్, ఆక్సిస్ బ్యాంక్‌లో రూ.57,13,664 కార్‌లోన్ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

పీఎస్సార్ ఆస్తులు రూ.54.80 కోట్లు

- అప్పులు రూ.7.50 కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి


నామినేషన్ వేసేందుకు వచ్చిన ప్రేమ్‌సాగర్‌రావు


మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తమ కుటుంబ ఆస్తులు దాదాపు రూ.54.80 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతేడాది ఇన్‌కంట్యాక్స్ రూ. 29,58,050 చూపించగా తన భార్య సురేఖ పేరిట రూ.4,50,280 చూపించారు. పీఎస్సార్ వద్ద రూ.6,26,300, సురేఖ వద్ద రూ. 4,22,350 నగదుతో పాటు ఇతర చరాస్తులన్నీ కలిపి పీఎస్సార్ వద్ద రూ.13,64,80,168, సురేఖ వద్ద రూ.1,12,00,654 ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్తుల్లో కాసిపేట మండలం కొండాపూర్‌లో 9.08 ఎకరాల భూమి, హైదరాబాద్‌లోని బేగంపేట్, మంచిర్యాలలో భవనం ఉన్నాయి. వాటి విలువ రూ.35,65,11,900, వారసత్వంగా వచ్చిన ఆస్తి రూ.90,80,000, తన భార్య పేరిట స్థిరాస్తులు 3,14,00,000, వీటన్నింటి విలువ రూ.54,80,81,052గా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల్లో రుణాలు, ఫైనాన్స్ రూపంలో రూ.7.50 కోట్ల అప్పు, ప్రభుత్వానికి వివిధ రూపాల్లో చెల్లించాల్సిన బకాయిలు రూ. 2,64,08,801గా చూపించారు. ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు పలు వ్యాపారాలు, పెన్షన్ రూపంలో ఆదాయం వస్తున్నట్లు చూపించారు. ప్రేమ్‌సాగర్‌రావు మీద ఉట్నూర్, మంచిర్యాల, సీసీసీ నస్పూర్, లక్సెట్టిపేట్, హాజీపూర్, సికింద్రాబాద్, నాంపల్లిలో మొత్తం 40 కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

దివాకర్‌రావు ఆస్తులు రూ.8.87 కోట్లు


నామినేషన్ వేసేందుకు వచ్చిన దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావు కుటుంబ ఆస్తి విలువ దాదాపు రూ.8.87 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో తన సొంత ఆస్తులు, వారసత్వంగా వచ్చినవి, తన పేరిట, తన భార్య పేరిట ఉన్న ఆస్తులు, భూములు, బంగారంకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతేడాది ఇన్‌కంట్యాక్స్ తన పేరిట రూ.1.90 లక్షలు, తన భార్య పేరిట రూ.4,01,550లు చూపించారు. చరాస్థులు ఆయన పేరిట రూ.86,22,715, భార్య పేరిట రూ.16,84,153, స్థిరాస్తులు తన పేరిట రూ. 2,87,50,000, భార్య పేరిట రూ.40 లక్షలు, వారసత్వంగా వచ్చిన ఆస్తులు తన పేరిట రూ.2.05 కోట్లు, భార్య పేరిట రూ.2.50 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో రూ.1.20 లక్షలు, తన భార్య వద్ద రూ.90 వేల నగదు ఉన్నట్లుగా చూపించారు. మహేశ్వరం మండలంలోని తూప్రాలో, మంచిర్యాల, పాతమంచిర్యాలలో ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, మంచిర్యాల, పాతమంచిర్యాలలో రెండు ఇళ్లు, రూ.13.20 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు ఉన్నట్లుగా చూపించారు. తన పేరిట ఎక్కడా ఒక్క పోలీసు కేసు కూడా నమోదు కాలేదన్నారు. బ్యాంకులు, ఇతరత్రా అప్పులు తన పేరిట లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కోనేరు కోనప్ప ఆస్తులు రూ.89.93 లక్షలు


కోనేరు కోనప్ప

కౌటాల: సిర్పూర్(టి) నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆస్తులు రూ.89.93 లక్షలు ఉన్నట్లు గురువారం ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించారు. యూనియన్ బ్యాంకు కాచిగూడలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.74,069, ఎస్‌బీఐ సెక్రెటరేట్ శాఖలో రూ. 3,06,958, కాగజ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకులో ఎన్నికల కోసం రూ.40,00,500, రూ.16 లక్షల విలువైన ఇన్నోవా కారు, ఐదు తులాల బంగారం రూ.3 లక్షలతో కలిపితే రూ.63,89,527 లక్షల చరాస్తులున్నట్లు చూయించారు. స్థిరాస్తిలో కాగజ్‌నగర్ మండలం సర్వే నంబర్ 47/13లో ఓ 3.300 గుంటలు, సర్వే నెంబర్ 176/2 కొత్తపేటలో 0.2000 గుంటల భూమి ఉన్నట్లు వెల్లడించారు. గుంటూర్ కాలనీలో 3600 స్క్వేర్‌ఫీట్ల ఇల్లు ఉన్నట్లు చూయించారు. సతీమణి కోనేరు రమాదేవి పేరిట పోస్టాఫీసుల్లో రూ. 3,715, రూ.14వేలు, రూ.14వేలు, రూ.14 వేల నగదుతో పాటు 40 తులాల బంగారం ఉన్నట్లు ఇందుకు ధర రూ. 24 లక్షలతో మొత్తం 26,03,715 ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

వివేకానంద్ ఆస్తి రూ.537 కోట్లు


గడ్డం వివేకానంద్

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానంద్ ఆస్తి రూ.537,67,40,482 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. అతని భార్య సరోజ పేరుమీద రూ.65,48,26,389, వివేక్ పేరు మీద రూ.209,38,19,850 కోట్ల విలువ గల భూములు, భార్య సరోజ పేరు మీద రూ.16,53,28,850 కోట్ల విలువ గల స్థిరచరాస్తులు, కుటుంబ సభ్యుల పేరు మీద రూ.41,54,87,569 అప్పులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట(బెల్లంపల్లి): చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నిండుతాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని దేవాపూర్ సల్పాలవాగులో గురువారం దండారీ దర్బార్ నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఉదయం నుంచి దండారీ నృత్యం చేస్తూ దర్బార్ నిర్వహించారు. అధికసంఖ్యలో హాజరైన ఆదివాసీలు, గిరిజనేతరులు దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఆదివాసీ తమపిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ.25 లక్షలతో ఆదివాసీలకు కమ్యూనిటీహాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చిన భక్తులకు దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలోభోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మద్దిమాడ సర్పంచ్ ఆడె జంగు, జెడ్పీటీసీ చంద్రయ్య, ఓరియంట్ హెచ్‌ఎం జీఎం కులకర్ణి, స్థానిక ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ ఆస్తి రూ.5.90 కోట్లు


బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఆస్తి రూ.5,90,73,438 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో సుమన్ పేరు మీద రూ.4,31,80.316, అతని భార్య రాణి అలేఖ్య పేరు మీద రూ.65,77,074, తల్లి సుమ పేరు మీద రూ.33,21,148, పెద్ద కుమారుడు సుహాన్ పేరుమీద రూ.30 లక్షలు, చిన్న కుమారుడు సుశాన్ పేరిట రూ.30 లక్షల డిపాజిట్లు ఉన్నాయి. రూ. 2,50 లక్షల విలువ గల స్థిరచరాస్తులు, క్యాతన్‌పల్లిలో రూ.74,22,180 విలువ గల భూమి, బాల్క సుమన్ పేరు మీద భీమారం మండలం అంకూపూర్‌లో 12.03 ఎకరాల రూ.16,03,980 విలువ గల వ్యవసాయ భూమి, ఇన్నోవా క్రిస్టా వాహనం, వివిధ బ్యాంకులలో రూ.85,41,535 డిపాజిట్లు, అప్పులు రూ.1,42,85,059 ఉన్నట్లు ఆయన వివరించారు.

'గిరి' గ్రామాల్లో దండారీ ఉత్సవాలు


సంప్రదాయ పూజల్లో గిరిజనులు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కగూడెం, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు దండారీ ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. దీపావళిని పురస్కరించుకుని గోండుతెగకు చెందిన ఆదివాసీలు ఖాఖోభాయి ఆలయ భేటీకి వెళ్లివచ్చి ఎత్మల్‌సార్–గుమ్మెల దండారీ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరపనున్నారు. ప్రత్యేక వేషధారణలో డప్పుచప్పుళ్ల మధ్య సంప్రదాయ నృత్యం చేస్తూ తమ ఆరాధ్య దేవతకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఊరు పోచమ్మ, హనుమాన్ ఆలయాలతో పాటు సకల దేవుళ్లకు పూజలు చేశారు. దీపావళి మరుసటి రోజున గంగస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ముగిస్తారు. అనంతరం పంట కోతలు ప్రారంభిస్తామని ఆదివాసీలు పేర్కొన్నారు. ఉత్సవాల్లో దండారీ పెద్దలు పెంద్రం మారు, పెంద్రం లస్కు, సోనేరావు, ధర్మారావు, సురేష్ పటేల్, తెలంగారావు, యువకులు శ్రావణ్, రాజ్‌కుమార్, రాకేశ్, తిరుపతి, అర్జున్, రాంచందర్, మనోజ్, స్థానిక గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.

'ఆర్‌ఎస్‌పీ వైఖరి నచ్చకనే రాజీనామా'



మాట్లాడుతున్న రమేశ్

మందమర్రిరూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వైఖరి నచ్చకనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేసిన తనకు కాకుండా కొత్తగా కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారికి టిక్కెట్ ఇచ్చారన్నారు. ఆయన వైఖరి నచ్చకనే పార్టీకి తనతో పాటు తన అనుచరులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తను ఏ పార్టీలో చరడం లేదని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానన్నారు. సమావేశంలో శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మణ్, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అజ్జు వచ్చేశాడు..

- కరోనాకు ముందు ఇంటినుంచి బయటికి వెళ్లిన యువకుడు
- ఐదేళ్ల తర్వాత ఇంటికి వచ్చిన వైనం


తల్లిదండ్రులతో అజ్జు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మతిస్థిమితం లేని ఆ యువకుడు కరోనాకు ముందు వెళ్లి ఐదేళ్లకు ఇంటికి తిరిగివచ్చాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. నర్సింగాపూర్‌కు చెందిన హమీదా, భాషా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు అజ్జు మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. 2019లో కరోనా సమయంలో కనుమరుగయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం వారి బంధువైన మహ్మద్ షరీఫ్ హైదరాబాద్‌కు వెళ్లగా అక్కడ ఓ హోటల్ ఎదుట అజ్జును చూసి ఒక్కసారిగా షాకయ్యాడు. వెంటనే అజ్జు తల్లిదండ్రులకు సమాచారం అందించగా గురువారం ఇంటికి తీసుకువచ్చారు. ఐదేళ్లకు ఇంటికి వచ్చిన కుమారుడిని అక్కున చేర్చుకున్న తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

59 ఎక్సైజ్ కేసులు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నెల రోజుల్లో 59కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ‘సాక్షి’కి తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.69లక్షల 93వేల 500 విలువ గల మద్యం, నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 147 లీటర్ల గుడుంబా, 8 కిలోల గంజాయి, 342 గంజాయి మొక్కలు, 12 లీటర్ల మద్యం, 250 కిలోల బెల్లం, 20 కిలోల పటిక, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. 17 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 3340 లీటర్ల కల్లు, 206 లీటర్ల కల్తీ కల్లు, 2390 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వివరించారు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరిపినా 18004252523 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.